కథానిక :

# కాలపరశు

★

శ్రీ కవికొండల వెంకటరావు

కాటాకు మూడు కాళ్లలాగు ఆమె గుడిసెక్కూడా మూడు కాళ్లున్నాయి. కాని లోపల ఆమె దుఃఖభారాన్ని మోచే రాళ్లుగాని సిబ్బెలుగాని లేవు. ఆమెకు వున్నది వొక్కటే చీర అని లోకం అంతా అనుకొంటూ వున్నా, ప్రతీ సాయంకాలం సంధ్యారాగం ఆకాశంమీద వెలిసినట్టు ఆ గుడిసె కాళ్లమీదను ఒక చీర ఆరఁజాచబడి లోపల మనిషిని తేనెమంచునుండి, కొండగాలినుండి కాపాడుతూండే పరిపాటి. తెల్లవారేసరికి మళ్ళీ గుడిసె రూపం అస్థిపంజరం అంత అతినగ్నం! ఆమె మాత్రం వెచ్చవెచ్చని సూర్యరశ్మిలో నున్నగా దువ్వుకొన్న తల నిగారిస్తూ వుంటే, ఒకటి రెండు పేరు లేని పువ్వు లేవో పెట్టుకొని, ఒక కడవ చంక నెట్టుకొని, అతివయ్యారంగా చీర ఎగకట్టుకుని, మేలుకొన్న కళ్ళతో, కొత్త మెలపు కొత్తతలపు ఏ రోజు కారోజే ఆమె కమరినట్టు దరహాసిత వదనయై నడాడుతూ చూపఱకు వింత గొలుపుతూంది. వయస్సు ఇరవై దరిదాపు- రహస్సు అడుగడుక్కీ పమిటి సర్దుకోవలసిన అవసరంగల ఒడుదుడుకు ఏపు. కల కూడా ఆమెకు నిరాశాకల్పనమే అన్నంత కటిక దరిద్రురాలు. కాని కుండ చంక నెట్టి, దానిమూతిని చుట్టి ముచ్చటగా బాహువల్లరి కుండలీకరిస్తూ వుంటే, ఆమె కండరములు, నవనాళ్లు, పొంగి, ఉప్పొంగి, ఆమె కేవేవో ఆశగొలిపేవి కలవు అని అనిపిస్తుంది. దైనందినంగా ఆమెచర్య నుపలక్షిస్తే అవే ఆమె జీవనానికి పునాదుల్లా తోచితీరకమానవు కూడాను

ఒకటి, మొదటిసారి కడవ కాలవలో సుప్రభాతాన్నే ముంచేముందు నీళ్లల్లో తన నీడ చూచుకోవడంలా తోస్తుంది. రెండు, కడవ ముంచి నీళ్లు నిండా పట్టి బుజాన్నెత్తుకు రోడ్డుదాటేలోగా రోడ్డుమీద గునపంతో పాడిచే "కఱకుర్రలావు" అనే యువకుణ్ణి పలుకరించడంలా తోస్తుంది. మూడు, ఆ నిండుకుండ నల్లా మోసుకెళ్లి, రోడ్డు రెండవపెడ నున్న తన గుడిసెమీది కొరిగి మొగ్గ ముమ్మరంగా తొడిగివున్న సర్కారు వారి తియ్యమామిడిచెట్టు మొదట వొంచి దాని మొదలంతా తడిపి నీరు కట్టడంలా తోస్తుంది. ఈ మూడు పనులు క్రమంగా ఆమె ముందొక ఆశాదృశ్యం, ఆమెయందొక ఆశాకిరణం, ఆమె ఊపిరిసందు నొక ఆశాపవనాంకూరము, నిలిపి, గొలిపి, మలపి, ఆమె నొక రామణీయకమైన మహత్తర జగత్తులో పోతగ్రహంలా ప్రతిష్ఠించి చూపిస్తాయి. పిఱనిమిషమం దామె పడే కష్టపాటు తప్పనిసరిది. పై మూడుపనులూ మాత్రం ఒకరు చెప్పి చేయించుకునేవి కావు. ఆమెకు అశిక్షితంగా అబ్బినవి. ఆమె నలరిస్తూ ఎదరవాని నలరించేవి.

ఆమెపేరు "కరువుల కాత్యాయని". ఆ నాటున కాయేడే ఆమె వచ్చి "సిమెంటు"

రోడ్డుపోతలో ఆడకూలీగా కుదిరి రోడ్డు వారనే తక్కిన జట్టువాళ్లతోపాటు చర కుటీరపు బ్రదుకు పుచ్చుతూవుంది. జనాభా లెక్కల్లోకి ఆమెపే రెక్కిందో లేదో చెప్ప లేను గాని, కంట్రాక్టరు మస్తరు బుక్కులో మాత్రం వుంది "కరువుల కాత్యాయనమ్మ" అని. చరకుటీరాలవాళ్లకు ఇళ్ల నెంబర్లుంటూ వుండవు. పనినిబట్టి మనుష్యుల యునికి! మనుష్యుల యునికినిబట్టి పని కాదు! రోడ్డున కోతట్టు బెజవాడ-బందరు కాలవ అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తూ తనప్రక్కన పెద్ద పెద్ద మఱ్ఱిచెట్లను ఏనాటినుంచో పెంచి పెద్దవాటినిగా చేసి చిరంతనకీర్తి సంపాదించు కొన్నది వుంది. ఇఖ ఆవైపునకు రోడ్డు వెడల్పుగా బోదు. రెండవవైపే ఏ విస్తరింపు గన్నా ఏ మార్పు చెందినా!

చెట్టేగాదు మనిషే.గాదు దాని కాలం దగ్గరపడే తుదిక్షణందాకా అది ఎదుగుతూ ఎల్లకాలం వుండేటట్లే నిండుగా కనబడు తుంది. అటువంటి దృశ్యాల్లో ఒకానొక దృశ్యం పైని సూచించిన తియ్యమామిడి చెట్టుయొక్క రూపు. అది ఎప్పుడు మొలి చిన మొక్కో ఒకడు వేసింది కాదు. కాకి పడేసిన టెంకనుబట్టి లేచి ఆయేటి కాయేడు రెమ్మ కొమ్మబలిసి తుదకు నిరుడు పూత నిలబడి ఈయేడు ఆలాఆలా రెండవ పర్యా యం మొగ్గమీగ వున్న మామిడిమొక్క! పి. డబ్లు. డి. వారి లెక్కల్లోకి ఆయేడే యెక్కి బెరడుకూస్త చెక్కబడి అంకె వేయబడి ఆదా రావచ్చుననే అంచనాగాంచి వుంది. కాని వేరు కారణాలచేతను మరో శాఖవారు ఆచెట్టునే తక్షణం నరికివేయ వలసినదిగా ఉత్తరువు జారీచేసియున్నారు. కారణం "హైవే"గానో "సైనికరస్తా"గానో గోడ్డు వెంటనే వెడల్పు కావడమే!

ఈ యుత్తరువు గాని ఆ లెక్కల్లో కెక్కించుకోవడంగాని చెట్టు కెంతమాత్రం తెలియదు. చెట్ల క్రింద గుడిసెలు వేసికొని రోడ్డు నిర్మాణమందు నిమగ్నులైయున్న పని వాళ్లకున్నూ తెలియదు. అందులోనూ కాత్యాయని గుడిసె పైచెట్టుక్రింద సరాసరి గుచ్చబడి వుంది. దానిమీద కా తియ్య మామిడిమోక కొమ్మలతో వారిగి అను కోని ఆనందం కలిగించేది. ఆ ఆనందం కొద్దీ ఆమె దాన్ని నిత్యమూ తడుపుతూ తన చెట్టే అదన్నట్టు తలపోస్తూవుండేది.

సిమెంటురోడ్డు అన్నది ఒక్క రోజులో తయారైపోయేరోడ్డు కాదు. అది అధునా తనపురహదారీ విస్తరింపుల్లో, పేరెన్నికగన్న మోస్తరున తయారయ్యేది. మనిషి నానా టికీ శాశ్వతతరంగా శాశ్వతతమంగా తన యొక్క కట్టడాల్ని, క్రంతల్ని ఏర్పాటు గావించుకోవడంలో "సిమెంటుకాంక్రీటు" విధానం వర్తమానమందు విశిష్టత దాల్చి వుంది. కానుకానులుగా చట్రాలమధ్య అం చీల మీద అది పెంచబడి మైళ్లకొద్దీ క్రమ క్రమాభివృద్ధి గాంచుతుంది. ఒక్కమాటుగా వ్యాప్తంగాదు. అందుచేత అది ఒకచోట రూపం దాలుస్తూ మఱెక్కడ ఆ రూపం ఎప్పుడు వహిస్తుందో ఎవ్వరికీ తెలియదు ఆ ప్లానులు చేత బట్టిన అధికార్లకు తక్క. అందాకా పని జరుగుతూన్న కాస్తమేర పెద్ద సందడి,—గునపం పోట్లు, కంకఅపఅపు, నీటి తడుపు, రోలర్ యంత్రం ఈల, గయిగయి, రయిరయి, అధికార్ల అదలకింపు, కంట్రాక్టర్ల ముదలకింపు! మిగతా ప్రదేశమందు

మామూలు పంథాయే, — చెట్లు, పశువులు, వ్యవసాయం, కొంపలు, నీళ్లు అన్నీ యథా ప్రకారంగా అనాదినుండీ ఏలాగు వుండివున్నాయో ఆలాగే వున్నట్లు పొడగడుతూ వుంటాయి.

ఆ యుదయం మన తియ్యమామిడి చెట్టుకు ఏవిధమైన ముప్పు వచ్చే జాడా ఎవ్వరూ కనిపెట్టలేదు. ఎటునుంచి దానికి కీడు? ముమ్మరంగా మొగ్గ తొడిగివుంది. దానిమీద వాలిన పక్షులేవీకూడా ఎవ్వరికీ ఆనడంలేదు. పైని మబ్బులేని ఆకాశం అతి పినీలవంతంగా నిశ్చలంగా వుంది. తూర్పున బొడసూపిన ఉషోరేఖలు ఎఱ్ఱబారి ఎక్కడెక్కడి పొగమంచును పటాపంచలు గావించి, "అవిగో! విజయవాడ పర్వతాలు! ఇవిగో! యలమకుదురు కొండలు! అవిగో! పసుపుతోటలు! ఇవిగో! పొగతోటలు!" అన ఏర్పాటుగా నిరూపించాయి కూలీలపిల్లకాయలు మట్టిలోపిల్లి మొగ్గలు వేసికొంటూ ఆడుకుంటూ వున్నారు. వాళ్ల కుక్క ఒకటి ఉండుండి మొరుగుతూ వుంది. "బారన్" పొయిలోకి రాక్షసిబొగ్గు ఒకడు విసురుతూ, ధడాల్న తలుపు వేసేశాడు. ఉండీలబద్దతో ఎవడో ఒక మట్టి ఉండను అంతరాళంలోకి కొట్టేడు.

అదే నిమిషానికి పేరు చెప్పని పెద్దవాడొకడు గొడ్డలేసుకువచ్చి గుభేల్న తియ్యమామిడిచెట్టు మొదట ఒక్క నరుకు పెట్టాడు. నరుకుతో నరద! నరదలో నరుకు! రెండోనరుక్కు గొడ్డలెత్తేలో — కరువుల కాత్యాయని చెంగుచెంగున వచ్చి మొదటి నరుకుమీద పడివుంది. ఆమెను చూడకుండానే కొట్టే అతను, ఎత్తిన గొడ్డలి నలాబలం కొద్దీ రెండవతూరి గుభేలు మనిపించాడు,

"నన్ను చూసైనా చెట్టును కాపాడతావనుకున్నానురా అన్నా!" అని కరువుల కాత్యాయిని తాను ద్వేధా తుండెములై పోతూ పెద్ద అఱపు అఱచింది. మూడో నరుక్కి చెట్టుచెట్టు మొగ్గతొడిమతోసహా కాత్యాయినిమీదకు పెటపెటలాడుతూ కూలిపోయి ఆమెను కప్పివేసింది! చూపఱకు ఆమె కాళ్లు చేతులు ఏవో చెట్టుయొక్క కొమ్మలూ వేళ్లూ ఏవోకూడా తెలియనంతటి కలిమిడి గోచరించింది.

అడిగినవాని కాస్థలం చెప్పే జవాబు "సర్కారుఉత్తరువునుబట్టి చెట్టు కొట్టబడింది; ఆమె నెవరు అడ్డుపడమన్నారు?" అని.

అడగనివాని కాస్థలం చూపిన కరుణ, ఒక కోయిల ఆ చెట్టుమీదనుండి ఎగిరిపోతూ "కువకువ" మన్న గీతాలాపం వింటూ, వేరే తడపడం అవసరం లేదన్నట్టు కఱకులాయుడు తాను పొడిచే గునపం యొక్క పోటుపోటుకు ఉడుకుడుగ్గా విడిచే కన్నీటి విడుపు.

"పడతి మఱి కడవతో నీళ్లు మోసుకొచ్చి పొడిచేటి బాటపై పోయనక్కఱలేదు! అతగాని కనుదోయి పోటు పోటుకు చుక్కగార్చేని నేర్చేని కాలంపు పరశు!